# గడ్చిరోలిలో నక్సలైట్ బ్యానర్లు కలకలం

- కుండం గ్రామంలో మావోయిస్టుల కరపత్రాలు
- నక్సలైట్ కరపత్రాలతో అప్రమత్తమైన పోలీసులు



చర్ల , జూలై 12:(ప్రజాజ్యోతి): మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఎటపల్లి తహసీల్ పరిధిలో నక్సలైట్ కార్యకలాపాల ఆనవాళ్లు మరోసారి వెలుగుచూశాయి. పిప్లి బుర్గి సబ్–పోలీస్ స్టేషన్ పరిధిలోని కుండం గ్రామం సమీపంలో ఆదివారం రహదారి పక్కన నక్సలైట్ బ్యానర్లు, కరపత్రాలు లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది. సమాచారం అందుకున్న పోలీసులు, భద్రతా బలగాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బ్యానర్లు, కరపత్రాలను స్వాధీనం చేసుకుని భారీ గాలింపు చర్యలు ప్రారంభించాయి. పోలీసుల ప్రాథమిక విచారణలో స్వాధీనం చేసుకున్న కరపత్రాలు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) పేరుతో విడుదలైనవిగా గుర్తించారు. అందులో వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులకు వ్యతిరేకంగా

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 13 | జులై | 2026 ◆ పేజీలు : 6

- బతికున్న రైతును మృతుడిగా చూపించి ఐదు ఎకరాల భూమి బదిలీ..
- అసైన్డ్ భూమిని ఇతరుల పేరుకు మార్చేందుకే పక్కా ప్రణాళిక అమలైందా..?
- ఆర్ఐ విచారణ లేకుండానే వారసత్వ ధ్రువీకరణ జారీ అయిందా..?
- నకిలీ మరణ ధ్రువీకరణ... వారసత్వ పత్రం... ధరణి మ్యుటేషన్... ఒక్కో మెట్టు ఎలా దాటారు..?
- డిజిటల్ సంతకంపై తహసీల్దార్ వివరణల్లో కొత్త సందేహాలు
- జీపీఓనే బలిపశువుగా మారుస్తున్నారా..?
- మధ్యవర్తుల పాత్రపై దర్యాప్తు జరపాలంటున్న స్థానికులు
- అసలు సూత్రధారులు ఎవరు..? సమగ్ర విచారణతోనే తేలనున్న నిజాలు
- డిజిటల్ సైన్ మిస్టరి..! పై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం







6 లో..

# అసైన్డ్ భూమి... పట్టా ఎలా మారింది..?

## (డిజిటల్ సైన్ మిస్టరి..!)


బతికే ఉన్న రైతును ప్రభుత్వ రికార్డుల్లో చనిపోయిన వ్యక్తిగా చూపించి.. ఐదు ఎకరాల అసైన్డ్ భూమిని ఇతరుల పేరుకు మార్చిన దమ్మపేట వ్యవహారం రోజురోజుకూ కొత్త కోణాలను వెలుగులోకి తీసుకొస్తోంది. తొలి కథనంలో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం, వారసత్వ ధ్రువీకరణ, ధరణిలో మ్యుటేషన్, పట్టాదారు పాస్‌బుక్ జారీ వరకు జరిగిన పరిణామాలను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రజాజ్యోతి... ఇప్పుడు ఈ వ్యవహారం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? ఇంత పెద్ద ప్రక్రియ ఎందుకు చేపట్టాల్సి వచ్చింది? అనే కోణాన్ని పరిశీలించింది.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# కూల్ డ్రింక్ బాటిల్‌లో దాగిన మిస్టరీ..!

- శీతల పానీయం సేవించిన అనంతరం వ్యాపారి ప్రాణాపాయ స్థితి
- బాటిల్‌లో ముందే విషపదార్థం కలిపి ఉండొచ్చనే అనుమానాలు
- దర్యాప్తుతోనే తేలనున్న అసలు నిజం






పినపాక, జులై 12 (ప్రజాజ్యోతి): ఒక శీతల పానీయం బాటిల్... ఓ నిరుపేద కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. జీవనోపాధి కోసం గ్రామాలు తిరుగుతూ చిరు వ్యాపారం చేసే ఓ వ్యక్తి శీతల పానీయం సేవించిన కొద్దిసేపటికే తీవ్ర అస్వస్థతకు గురై ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలో కలకలం రేపుతోంది. ఘటన జరిగిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతుండగా, బాధిత కుటుంబం చేసిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ ప్రారంభించారు. అసలు ఏం జరిగిందనే విషయం

మిగతా 2 లో...



# భద్రాద్రి వైకుంఠ ద్వారానికి కొత్త వైభవం

- 54 ఏళ్ల చరిత్రకు ముగింపు.. నూతన ఉత్తర ద్వార నిర్మాణానికి శ్రీకారం
- ఆలయ విస్తరణ పనులకు వేగం.. వైకుంఠ ఏకాదశికి ముందే పూర్తి చేయడమే లక్ష్యం
- ఇక భక్తులకు మరింత విశాలంగా వైకుంఠ ద్వార దర్శనం

భద్రాచలం, జులై 12, (ప్రజాజ్యోతి): భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మరో చారిత్రక అధ్యాయానికి తెరలేచింది. కలియుగ వైకుంఠంగా పేరొందిన ఈ దివ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా లక్షలాది మంది భక్తులకు మోక్షద్వారంగా భావించే ఉత్తర ద్వారం 54 ఏళ్ల తర్వాత పూర్తిగా కొత్త రూపు దాల్చబోతోంది. ప్రభుత్వం చేపట్టిన ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా పాత ఉత్తర ద్వారాన్ని తొలగించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ద్వారాన్ని నిర్మించేందుకు దేవస్థానం శ్రీకారం చుట్టింది. భక్తుల రద్దీకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆదివారం సాయంత్రం ఉత్తర ద్వారాన్ని తొలగించడంతో అభివృద్ధి పనుల్లో కీలక ఘట్టం ప్రారంభమైంది.


- చరిత్రకు వీడ్కోలు... కొత్త అధ్యాయానికి శ్రీకారం

భద్రాచలం దేవస్థానం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఆలయ ప్రాంగణంలోని బేడా మండపం నుంచి ప్రస్తుతం ఉన్న ఉత్తర ద్వారం వరకు విస్తరణ పనులు చేపట్టనున్నారు. రెండు ప్రాకారాలతో ఆలయాన్ని మరింత విశాలంగా అభివృద్ధి చేయనున్నారు. భారీ నిర్మాణాలు చేపట్టనున్న నేపథ్యంలో ఉత్తర భాగంలో ఇప్పటికే భూసార పరీక్షలు కూడా పూర్తి చేశారు. నిర్మాణ పనులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తవడంతో ప్రస్తుతం పనులను

మిగతా 2 లో...

## గడ్చిరోలిలో నక్సలైట్ బ్యానర్లు కలకలం





(మొదటి పేజీ తరువాయి...)

ప్రజలు ఏకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఓఎంఎస్ఐ, నేచురల్ కంపెనీ, సన్‌ఫ్లవర్ ప్రాజెక్ట్‌తో పాటు ఇతర పారిశ్రామిక ప్రాజెక్టులను వ్యతిరేకించాలని గ్రామస్తులు, సర్పంచులు, పటేల్ నాయకులకు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.కరపత్రాల్లో "నీరు–అడవి–భూమి" పరిరక్షణ అంశాన్ని ప్రస్తావిస్తూ పారిశ్రామిక ప్రాజెక్టులు స్థానిక ప్రజల జీవనాధారాన్ని, భవిష్యత్తు తరాల మనుగడను దెబ్బతీస్తాయని ఆరోపించారు. ఆయా కంపెనీలకు మద్దతు ఇచ్చేవారికి తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరికలు కూడా చేసినట్లు పోలీసులు తెలిపారు.సన్‌ఫ్లవర్ ప్రాజెక్ట్, హెడ్‌కాసా–కుక్రి–మొహుర్లి ప్రాంతంలోని నేచురల్ కంపెనీ, జేఎస్‌డబ్ల్యూ ప్రాజెక్ట్, ఖేమరగర్హి–పిప్లి బుర్గి ప్రాంతంలో ప్రతిపాదిత డ్రోన్ సర్వేలను వెంటనే నిలిపివేయాలని కరపత్రాల్లో డిమాండ్ చేసినట్లు వెల్లడించారు.గడ్చిరోలి జిల్లాలో భద్రతా బలగాలు చేపడుతున్న నిరంతర నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లతో మావోయిస్టుల కార్యకలాపాలు గణనీయంగా తగ్గినప్పటికీ ఈ ఘటన మరోసారి వారి ఉనికిపై ఆందోళనలు వ్యక్తం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటన అనంతరం చుట్టుపక్కల అటవీ ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి! విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ప్రజలు వదంతులను నమ్మవద్దని అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో బోనాల జాతర కరపత్రం విడుదల



**టేకులపల్లి,జూలై 12,ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కుమ్మర్ల తొలి బోనాల జాతరకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివా రం టేకులపల్లిలో విడుదల చేశారు .ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ఈ నెల 16న హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న శ్రీ శ్రీ కనకాలకట్ట మైసమ్మ ఆలయంలో కుమ్మర్ల తొలి బోనాల జాతర వైభవంగా నిర్వహించను న్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్‌రావు,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా అడాల గణేష్, మహిళా ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా మల్లెల ఉషారాణి నియమితులై జాతరను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం మహిళా అధ్యక్షురాలు, న్యాయవాది మల్లెల ఉషారాణి, జిల్లా అధ్యక్షురాలు ఆమేడ రేణుక, నాగభూషణం ఆధ్వర్యంలో బోనాల జాతర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు బోనాల జాతరలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ఆశీర్వాదాలు పొందాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల అధ్యక్షురాలు ఆమేడ రమ, మండల నాయకులు అలవాల శ్రీనివాసరావు, ఆమేడ రమేష్, పోతుగంటి సైదులు, గుడిమెట్ల వెంకటనరసయ్య, మండల నాయకురాలు ఆమేడ ఉమా, అలవాల స్వరూప, ఆమేడ సరోజ, బొడ్డుపల్లి స్వాతి, పోతుగంటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి వైకుంఠ ద్వారానికి కొత్త వైభవం

(మొదటి పేజీ తరువాయి...)

వేగవంతం చేస్తున్నారు. భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది.

### ♦ ఇదీ ఉత్తర ద్వారం ప్రస్థానం...

భద్రాచలం ఆలయంలో తొలినాళ్లలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారు దక్షిణ ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చేవారు. అనంతరం అప్పటి దేవస్థానం చైర్మన్ అల్లూరి మూర్తిరాజు చొరవతో 1972లో ఉత్తర ద్వారాన్ని నిర్మించారు. కేవలం 45 రోజుల్లో నిర్మాణం పూర్తికాగా, అప్పటి నుంచి అదే ద్వారం ద్వారా వైకుంఠ ద్వార దర్శనం కొనసాగుతోంది. 2010లో అప్పటి దేవస్థానం ఈవో ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్ ఆధ్వర్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని



ఉత్తర ద్వారాన్ని వెనక్కి జరిపి మరింత వెడల్పుగా నిర్మించారు. అదే సమయంలో భక్తుల సౌకర్యార్థం రూ.15 లక్షల వ్యయంతో ఇనుప ఫుట్ బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా ఆ ఫుట్ బ్రిడ్జిని తొలగించడంతో పాటు పాత ఉత్తర ద్వారాన్ని కూడా పూర్తిగా తొలగించి ఆధునిక హంగులతో నూతన ద్వారాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు.

### ♦ భక్తుల సౌకర్యమే లక్ష్యం...

ఈ ఏడాది డిసెంబరు 10 నుంచి 30 వరకు నిర్వహించనున్న అధ్యయనోత్సవాలు, వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు ముందే ఉత్తర భాగంలోని ప్రధాన పనులను పూర్తి చేయాలని దేవాదాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం సంబంధిత కాంట్రాక్టర్‌కు పనులు వేగవంతం చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. నూతన ఉత్తర ద్వారం నిర్మాణంతో వైకుంఠ ఏకాదశి సందర్భంగా లక్షలాది మంది భక్తులకు మరింత విశాలమైన దర్శన సౌకర్యం, రద్దీ నియంత్రణకు అనువైన మార్గాలు, మెరుగైన భద్రతా ప్రమాణాలు అందుబాటులోకి రానున్నాయి. సంప్రదాయాన్ని పరిరక్షిస్తూనే కాలానుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నట్లు దేవస్థానం వర్గాలు చెబుతున్నాయి. 54 ఏళ్ల తర్వాత ఉత్తర ద్వారానికి కొత్త రూపు తీసుకురావడం భద్రాద్రి చరిత్రలో మరో కీలక మైలురాయిగా నిలవనుండగా, రానున్న వైకుంఠ ఏకాదశి నాటికి భక్తులకు మరింత విశాలమైన ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు అధికారులు అన్ని చర్యలు వేగవంతం చేస్తున్నారు.

## కూల్ డ్రింక్ బాటిల్‌లో దాగిన మిస్టరీ..!

(మొదటి పేజీ తరువాయి...)

ఫోరెన్సిక్ పరీక్షలు, అధికారుల దర్యాప్తు అనంతరమే తేలనుంది.

### ♦ గిన్నెలు, చిక్కు వెంట్రుకల వ్యాపారి..

ఏన్కూరు మండలం ఏన్కూరు గ్రామానికి చెందిన జక్కం రాములు (తండ్రి: బిక్షం) గిన్నెలు, చిక్కు వెంట్రుకల వ్యాపారం చేస్తూ గ్రామాలు తిరుగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ నెల 4వ తేదీన పినపాక మండలం తొగ్గూడెం గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో ఒక లీటర్ శీతల పానీయం కొనుగోలు చేసి సేవించిన కొద్దిసేపటికే తీవ్ర అస్వస్థతకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పానీయం తాగిన వెంటనే అది చేదుగా అనిపించడంతో తీవ్ర వాంతులు చేశాడని, వాంతుల్లో ఆకుపచ్చ రంగు ద్రవం రావడంతో స్థానికులు వెంటనే పినపాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారని తెలిపారు. అక్కడి నుంచి మణుగూరు ఏరియా ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని శ్రీకృష్ణ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడ చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స కోసం ఇప్పటికే సుమారు రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేశామని, కుటుంబానికి ఆయనే ప్రధాన ఆధారం కావడంతో ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని వారు కోరుతున్నారు.

### ♦ ఇలా జరిగి ఉండొచ్చు..?

ఈ ఘటనతో గ్రామంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, సంబంధిత కిరాణా దుకాణం ఉన్న ఇంట్లోనే ఎవరో వ్యక్తిగత అవసరం కోసం శీతల పానీయం బాటిల్‌లో గడ్డి మందు లేదా ఇతర విషపదార్థం కలిపి ఉంచి ఉండవచ్చని, అదే అనుకోకుండా విక్రయానికి వెళ్లి బాధితుడి చేతికి చేరి ఉండొచ్చనే చర్చ సాగుతోంది. బాధితుడు వాంతులు చేస్తుండగా కిరాణా దుకాణం ఇంటి నుంచి ఓ మహిళ వచ్చి చింతపండు పులుసుతో పాటు మరికొన్ని పదార్థాలు ఇచ్చి ప్రథమ చికిత్స చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అనంతరం ఆ బాటిల్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లి కడిగి శుభ్రం చేసినట్లు కూడా గ్రామంలో ప్రచారం జరుగుతోంది. అలాగే బాధితుడిని కిరాణా దుకాణం కుటుంబ సభ్యులే తొలుత ఆసుపత్రికి తరలించి కొంతకాలం చికిత్సకు సహకరించినప్పటికీ, అనంతరం వైద్య ఖర్చులకు సహకరించలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. అయితే ఈ వాదనలు, ఆరోపణలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టగా, ఆహార భద్రత శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా సమగ్ర దర్యాప్తు జరిపి, సంబంధిత ఆధారాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించాలని గ్రామస్థులు కోరుతున్నారు. బాటిల్‌లో విష పదార్థం ఉందా..? ఉంటే అది ఎక్కడ కలిసింది..? అనే ప్రశ్నలకు దర్యాప్తు పూర్తయిన తర్వాతే సమాధానం లభించే అవకాశం ఉంది.

## గిరిజన హక్కుల రక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతాం: గుగులోత్ రామ్‌చందర్



**టేకులపల్లి, జూలై 12,ప్రజాజ్యోతి:** గిరిజనుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య కార్యవర్గ సభ్యుడు గుగులోత్ రామ్‌చందర్ తెలిపారు.ఆదివారం టేకులపల్లి లో ఆయన మాట్లాడు తూ ఈ నెల 18, 19 తేదీల్లో పాల్వంచ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య మూడవ రాష్ట్ర మహాసభలు నిర్వహించను న్నట్లు వెల్లడించారు. గిరిజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు,సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలతో పాటు గిరిజనుల హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యాచరణపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని గిరిజనులందరూ ఐక్యంగా మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గుగులోత్ సోనీ, చింత అరుణ, ఈసం మణి, కల్తీ స్వరూప, పాపమ్మ, మంగ, దేవమ్మ, భాను తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి: తోడేటి నాగేశ్వరరావు



**టేకుల ప ల్లి, జూలై 1 2 , ప్రజాజ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్ టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు డి. ప్రసాద్ డిమాండ్ చేశారు.ఆదివారం టేకులపల్లిలో బానోతు లక్ష్మణ్, షఫీ అధ్యక్షతన నిర్వహించిన ఆటో కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అధికారంలోకి వస్తే ప్రతి ఆటో కార్మికుడికి సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి ఆటో కార్మికుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో నెల్లూరి శ్రీను, షఫీ, సురేష్, డి. శ్రీను, గురుమూర్తి, సతీష్, బానోత్ లక్ష్మణ్, బోడ మోహన్, తరుణ్, సంతోష్, రమేష్, చింతా నరేష్ తదితర ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి విశిష్ట సేవలు అందించిన మహోన్నత వ్యక్తి కేఎల్ఆర్

- డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్, /పాల్వంచ, జూలై 12,(ప్రజా జ్యోతి)** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విద్యారంగానికి విశిష్ట సేవలు అందించిన మౌనత వ్యక్తి వ్యక్తి డాక్టర్ కాటిరెడ్డి లక్ష్మారెడ్డి అని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.పాల్వంచలోని కే ఎల్ ఆర్ విద్యాసంస్థల అధిపతి దివంగత డాక్టర్ కాటిరెడ్డి లక్ష్మారెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా కేఎల్ఆర్ బి ఫార్మసీ కళాశాలలో ఉన్న కే ఎల్ ఆర్ విగ్రహానికి కొత్వాల తోపాటు కాంగ్రెస్ నాయకులూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొత్వాల మాట్లాడుతూ కేఎల్ఆర్ విద్యాసంస్థల పేరుతొ వేలాది మందికి విద్యను అందించిన వ్యక్తి కే ఎల్ ఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో కే ఎల్ ఆర్ సతీమణి కె నాగమణి, కుమారుడు కె సిద్ధార్థరెడ్డి, కుమార్తె సింధు, కుటుంబసభ్యులు కె శంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి లతో పాటు కార్పొరేటర్ కాల్వ భాస్కరరావు, కాంగ్రెస్ నాయకులు జాలే జానకి రెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కోండం వెంకన్న గౌడ్, వై వెంకటేశ్వర్లు( వై.వి) బండి లక్ష్మణ్, గజ్జి శ్రీను, దండోరా శ్రీను, కొత్తపల్లి సోమయ్య, భావ్ సింగ్, బి ఆర్ ఎస్ నాయకులు కాల్వ ప్రకాశరావు, పరంధామరెడ్డి, జర్నలిస్టులు సంజీవ్, చంద్ర నర్సింహారావు, వెంకట రెడ్డి, వేలదండి ప్రసాద్ పాల్గొన్నారు.

## కేటీపీఎస్ కాలుష్య సమస్యను పరిష్కరించాలని 2 వ డివిజన్ కార్పొరేటర్ మంత్రి వివేక్ కు వినతి



**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 12,(ప్రజా జ్యోతి)** కేడీపీఎస్ కర్మాగారం నుండి వెలబడుతున్న కాలుష్య సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం కార్పొరేషన్ రెండు బ డివిజన్ బాలంపాటి భవిత కిరణ్ ఆదివారం పాల్వంచ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ని కలిసి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా కార్పొరేటర్ భవిత కిరణ్ మాట్లాడుతూ, కేటి పి ఎస్ కర్మాగా రం నుండి వెలువడుతున్న కాలుష్య ప్రభావంతో 2వ డివిజన్ కాలనీ ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, దుమ్ము, బూడిద వంటి పలు సమస్యలను ఎ దుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమస్యలను విన్న మంత్రి కేటీపీఎస్ యాజమాన్యంతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని సానుకూలంగా హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 12 ,(ప్రజా జ్యోతి)** నేడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం లోని ఆర్డీవో కార్యాలయం లో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# కాంకేర్ లో భారీ నక్సలైట్ల సామాగ్రి స్వాధీనం

- రెండు .303 రైఫిళ్లు, ల్యాప్‌టాప్ , టాబ్లెట్, వైర్‌లెస్ పరికరాలు సహా భారీ సామగ్రి స్వాధీనం





**చర్ల , జూలై 12(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో భద్రతా దళాలు నిర్వహించిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భారీ విజయాన్ని నమోదు చేశాయి. కాంకేర్–నారాయణ్‌పూర్ సరిహద్దులోని దట్టమైన అడవుల్లో నక్సలైట్లు రహస్యంగా దాచి పెట్టిన ఆయుధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, యూనిఫాంలు, సాహిత్యాన్ని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. భవిష్యత్ నక్సల్ కార్యకలాపాలు, ఆయుధాల సరఫరా కోసం ఈ నిల్వను ఏర్పాటు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.జూలై 11న కోయిలిబేడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్పరాస్–గుమ్‌చూర్ గ్రామాల మధ్య ఉన్న దుర్గమ అటవీ, కొండ ప్రాంతంలో జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్), బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ (బీడీఎస్) సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. గాలింపు సమయంలో భూమి కింద, పొదల మధ్య రహస్యంగా దాచిన నక్సలైట్ల స్థావరాన్ని గుర్తించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ ఆపరేషన్‌లో రెండు .303 రైఫిళ్లు, .303 రైఫిల్‌కు చెందిన 32 రౌండ్ల కాట్రిడ్జ్‌లు, ఒక ల్యాప్‌టాప్, ఒక టాబ్లెట్, మూడు వైర్‌లెస్ బ్యాటరీలు, ఒక రేడియో సెట్, రెండు నక్సలైట్ యూనిఫాంలు, ఐదు పర్సులు, రెండు ఛార్జర్లు, ఒక స్పేర్ బ్యాటరీ, నక్సలైట్ సాహిత్యం, ఇతర నిత్యావసర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.బస్తర్ రేంజ్ ఐజీ బద్రి నారాయణ్ మీనా ఆదేశాల మేరకు నక్సల్ వ్యతిరేక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. బీఎస్ఎఫ్ భాను ప్రతాప్‌పూర్ డీఐజీ దీపక్ తివారీ, కాంకేర్ ఎస్పీ నిఖిల్ రాఖేచా, బీఎస్ఎఫ్ 40వ బెటాలియన్ కోయిలిబేడ సెకండ్ ఇన్ కమాండ్ నరేంద్ర శర్మ ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు.అసిస్టెంట్ కమాండెంట్ అంకుష్ కుమార్, కోయిలిబేడ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ నిర్మల్ జాంగ్డే, బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ అనుజ్ కుమార్, సబ్ ఇనస్ప్ెక్టర్లు నవీన్ ప్రకాష్, సౌరభ్ యాదవ్, డీఆర్‌జీ టీమ్ కమాండర్ నరేంద్ర నేతమ్‌తో పాటు పెద్ద సంఖ్యలో భద్రతా సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.కాంకేర్–నారాయణ్‌పూర్ సరిహద్దు ప్రాంతం నక్సల్ ప్రభావిత ప్రాంతంగా ఉండటంతో అడవులు, కొండ ప్రాంతాల్లో సంయుక్త కూంబింగ్, ఏరియా డామినేషన్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. నిఘా సమాచారం ఆధారంగా నక్సలైట్ల స్థావరాలు, ఆయుధ నిల్వలు, సరఫరా వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు అన్నారు . ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు అనుకూల వాతావరణం కల్పించడమే ఈ ఆపరేషన్ల ప్రధాన ఉద్దేశమని అన్నారు .

## కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభమైన నాలుగు డివిజన్ల ఉద్యోగుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లు





**కొత్తగూడెం కలెక్టరేట్ / పాల్వంచ, జూలై 12,(ప్రజా జ్యోతి)** భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశాల మేరకు పాల్వంచ మండలంలోని కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం దమ్మపేట, పాల్వంచ, ఇల్లందు, భద్రాచలం డివిజన్ల ప్రభుత్వ ఉద్యోగుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లు ఘనంగా ప్రారంభమయ్యాయి, ఈ పోటీలను దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్ ప్రారంభించారు, ఈ పోటీలకు నాలుగు డివిజన్లకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారు. మొదటిరోజు క్రీడాకారులు వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు,. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉద్యోగుల పనిఒత్తిడిని తగ్గించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు ,ఉద్యోగుల మధ్య స్నేహభావం, ఐకమత్యం, జట్టుగా పనిచేసే నైపుణ్యం పెంపొందించేందుకు ఇలాంటి ఫ్రెండ్లీ క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు, గెలుపు–ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని సూచించారు.ఇలాంటి కార్యక్రమాలు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేస్తాయని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విజేత జట్టును అభినందించి, పాల్గొన్న అన్ని డివిజన్ల ఉద్యోగ క్రీడాకారులను అధికారులు సత్కరించారు. ఈక్రీడా పోటీలలో తొలి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ – డి. రవి (దమ్మపేట జట్టు, ఏటీడీవో)రెండో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ – రాహుల్ ఐఏఎస్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ – గోవర్ధన్ లో విజేతగా నిలిచారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏజెన్సీలో విద్యారంగానికి లక్ష్మారెడ్డి చేసిన కృషి మరువలేనిది

- లక్ష్మారెడ్డి అడుగుజాడల్లో నేటితరం నడుచుకోవాలి
- వందేళ్లైనా అయనా జ్ఞాపకాలు మర్చిపోలేం
- లక్ష్మారెడ్డి 15వ వర్ధంతి సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా





**కొత్తగూడెం కలెక్టరేట్ / పాల్వంచ ,జూలై 12, (ప్రజా జ్యోతి)** పాల్వంచ పట్టణంలోని కె ఎల్ ఆర్ విద్యాసంస్థల అధినేత, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు దివంగత కాటిరెడ్డి లక్ష్మారెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్ లు ఆదివారం స్థానిక కె ఎల్ ఆర్ ఘాట్ వద్ద లక్ష్మారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్ధంతి సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ఏజెన్సీలో విద్యా వ్యాప్తికి లక్ష్మారెడ్డి చేసిన కృషి మరువలేనిదిని, లక్ష్మారెడ్డి మొదటి నుంచి పోరాట పటిమ కలిగిన వ్యక్తి అని ,ఒక్కపడు విద్యార్థి నాయకుడుగా పేద విద్యార్థుల సమస్యలు తెలిసిన వ్యక్తిగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో అనేక విద్యా సంస్థలను స్థాపించి పేద విద్యార్థులకు విద్య అందించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు, లక్ష్మారెడ్డిని ఎందరో పేద విద్యార్థులకు విద్యను అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దిన లక్ష్మారెడ్డి అడుగుజాడల్లో నేటితరం నడుచుకుంటూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు. వందేళ్లైనా ఆయన జ్ఞాపకాలు మర్చిపోలేనని తనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పలువురు సిపిఐ నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

- **రూ.18 లక్షల విలువైన బంగారం, నగదు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం**



**చర్ల, జూలై 12(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ బస్తర్ దంతేవాడ జిల్లాలో మావోయిస్టులపై భద్రతా దళాలు మరో కీలక విజయాన్ని నమోదు చేశాయి. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టులు ఇచ్చిన సమాచారం మేరకు బార్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోడ్మా గ్రామ అటవీ ప్రాంతంలో నిర్వహించిన సంయుక్త గాలింపు చర్యల్లో మావోయిస్టులు దాచిపెట్టిన భారీ ఆయుధాల డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో రూ.18 లక్షల విలువైన బంగారం, నగదు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని జప్తు చేశారు.బస్తర్ రేంజ్ ఐజీ బద్రీ నారాయణ్ మీనా మార్గదర్శకత్వంలో, సీఆర్పీఎఫ్ డీఐజీ (ఆపరేషన్స్) రాకేష్ చౌదరి, దంతేవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీలు రామ్ కుమార్ బర్మన్, జితేంద్ర కుమార్ ఖుంటే పర్యవేక్షణలో పోలీసులు, భద్రతా దళాలు సంయుక్తంగా గాలింపు చేపట్టాయి.లొంగిపోయిన మావోయిస్టులు అందించిన ఖచ్చితమైన సమాచారం ఆధారంగా తోడ్మా గ్రామ దట్టమైన అడవుల్లో భూమిలో రహస్యంగా దాచిన డంప్‌లను గుర్తించారు. భద్రతా బలగాలపై దాడులు, భవిష్యత్ నక్సల్ కార్యకలాపాల కోసం ఈ ఆయుధాలు, పేలుడు పదార్థాలను నిల్వ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

### ››› స్వాధీనం చేసుకున్న సామగ్రి

పోలీసులు 116 గ్రాముల బంగారు బిస్కెట్లు (విలువ సుమారు రూ.16 లక్షలు),రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు ఒక ఇన్సాస్ రైఫిల్, 16 ఇన్సాస్ మ్యాగజైన్లు, నాలుగు ఏకే–47 మ్యాగజైన్లు, 68 ఏకే–47 రౌండ్లు, 23 ఎస్ఎల్ఆర్ మ్యాగజైన్లు, 34 ఎస్ఎల్ఆర్ రౌండ్లు, ఐదు 12 బోర్ తుపాకులు, ఏడు 12 బోర్ రౌండ్లు, మూడు బీజీఎల్ లాంచర్లు, ఒక బీజీఎల్ సెల్, రెండు కార్బైన్ మ్యాగజైన్లు, ఎనిమిది .303 రౌండ్లు, 45 .303 చార్జర్లు, ఆరు 8 ఎంఎం రౌండ్లు, పది విరిగిన భర్మార్ తుపాకులు, ఒక రివాల్వర్, ఒక ఎయిర్ గన్‌ను జప్తు చేశారు.అలాగే ఆరు టిఫిన్ బాంబులు, నాలుగు పైప్ బాంబులు, 122 బాణం బాంబులు, ఒక పారా బాంబు, రెండు నాటు హ్యాండ్ గ్రెనేడ్లు,రెండు నాటు మోర్టార్లు, జిలెటిన్, 20 డెటోనేట ర్లు, కోడెక్స్ వైర్ బండిల్, 14 కుక్కర్లు, యూనిఫాం బట్టలు, మందులు, నక్సలైట్ కరపత్రాలు, ఇతర నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం ఈ డంప్ స్వాధీనం కావడంతో భవిష్యత్‌లో భద్రతా బలగాలపై దాడులకు మావోయిస్టులు పన్నిన భారీ కుట్ర భగ్నమైంది అని లొంగిపోయిన మావోయిస్టుల సహకారంతో ఈ విజయం సాధ్యమైందని నక్సలిజాన్ని వీడి జనజీవన స్రవంతిలో చేరేందుకు ఇది మంచి ఉదాహరణగా నిలుస్తుందని అధికారులు అన్నారు.దంతేవాడ పోలీసులు మిగిలిన మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని విడిచి లొంగిపోయి ప్రభుత్వ పునరావాస పథకాలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, గ్రామస్తులు, మేధావులు సహకరించాలని కోరారు.




## వనవాసీ పరిషత్ కి 50 కిలోల బియ్యం వితరణ



**చర్ల, జూలై 12(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొమరం భీం విద్యార్థి నిలయానికి ఆయిల్ బంక్ ఏరియాలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ అర్చకులు మంచిరాజు వెంకటేశ్వరరావు ఆదివారం 50 కిలోల బియ్యంతో పాటు విద్యార్థులకు తువ్వాళ్లను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత మాట్లాడుతూ నిరుపేద ఆదివాసీ విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు మరింత మంది దాతలు సహకరించి ఆదివాసీ విద్యార్థుల భవిష్యత్తుకు చేయూత అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.దాతలు అందిస్తున్న సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మంచిరాజు వెంకటేశ్వరరావు, విద్యార్థి నిలయ ప్రముఖ్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ వెంకటస్వామికి బొమ్మెర శ్రీనివాస్ వినతి

- **ఏజెన్సీ ఎస్సీలకు స్థానిక సంస్థల రిజర్వేషన్ కల్పించాలి**
- **ఎస్సీ రైతుల సాగు భూములకు హక్కులు కల్పించాలి**





**కొత్తగూడెం టౌన్ జూలై 12 ( ప్రజాజ్యోతి )** షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కొత్తగూడెం వచ్చిన సందర్భంగా ఆదివారం వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల స్థానిక రాజకీయ ప్రాతినిధ్యం ఎంపీటీసీ,జెడ్పీటీసీలు.ఏజెన్సీ ప్రాంత ఎస్సీ రైతుల తరతరాల సాగుభూములకు హక్కులు కెసిఆర్ ప్రభుత్వంలో తొలగించిన వాటిని తిరిగి అమలు చేయాలని మంత్రికి విన్నవించారు. సంబంధిత మంత్రులు ఈ విషయంపై ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల పక్షాన నిలబడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి ఈ సమస్యకు పరిష్కారం మార్గం చూపాలని తెలియజేశారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల మనగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.స్పందించిన మంత్రి సమస్య పరిష్కారం కోసం ఆలోచన చేద్దామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోద రమేష్, అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మద్దెల శివకుమార్, చిన్నన్న,గుండా రమేష్,అశోక్, ఎనగంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు





**చర్ల, జూలై 12(ప్రజా జ్యోతి ):** తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ చర్ల లోని పాతచర్ల అంబేద్కర్ నగర్ వాసులు ఆదివారం స్థానిక ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులకు పంటలు బాగా పండాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల ఎస్సీ సెల్ నాయకుడు అలవల కృష్ణ, బీఆర్ఎస్ మండల నాయకుడు కను భద్రం, గ్రామ పెద్దలు అలవల చంద్రయ్య, మచ్చ భద్రం, మచ్చ సమ్మయ్య, వంకాయల లక్ష్మణరావు, మచ్చ బుజ్జిబాబు, మచ్చ వెంకటేశ్వర్లు, గుద్దేటి నాగరాజు, వారికల రమణయ్య, గుద్దేటి సాయి, ఆకారపు వెంకటేశ్వర్లు, ఆకారపు శ్రీను, కునుకు వీర్రాజు, కాతినేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో జ్యూస్ స్టాల్ ఓనర-వర్కర్ల యూనియన్ ఏర్పాటు

- **షాబీర్ భాష చేతుల మీదుగా ఐడి కార్డులు**





**కొత్తగూడెం, టౌన్ జూలై 12 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జ్యూస్ స్టాల్ ఓనర్లు మరియు వర్కర్ల సంక్షేమం కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో జ్యూస్ స్టాల్ ఓనర్–వర్కర్ యూనియన్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు సాబీర్ పాషా మరియు ఎఐటియుసి జిల్లా జాయింట్ సెక్రటరీ నాగేష్ సమక్షంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జ్యూస్ స్టాల్ యజమానులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, కార్మిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయడంతో పాటు యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కొత్తగూడెం మున్సిపాలిటీ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ మసూద్ భాయ్ బోడ చంటి, రెడ్డి రాము, రాఘవ, గుత్తుల రామకృష్ణ, రెడ్డి సత్తి, రెడ్డి సత్యనారాయణ, శీలం ఈశ్వర్, మొకరం, కల్లూరి పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.యూనియన్ ఏర్పాటుతో జ్యూస్ స్టాల్ యజమానులు, వర్కర్ల సమస్యలను సమిష్టిగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి సంక్షేమం కోసం కృషి చేయనున్నట్లు నాయకులు తెలిపారు.

## ఉమ్మడి ఖమ్మంపై జనసేన ఫోకస్

- పార్టీ విస్తరణకు కొత్తగూడెం వేదిక





**కొత్తగూడెం టౌన్, జూలై 12 (ప్రజాజ్యోతి):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై జనసేన దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కొత్తగూడెం కేంద్రంగా ఆదివారం భారీ బైక్ ర్యాలీ, నూతన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై పార్టీ పట్ల తమ మద్దతును చాటారు. గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొత్తగూడెం ఓల్డ్ డిపో సెంటర్ నుంచి ప్రారంభమైన భారీ బైక్ ర్యాలీ గణేష్ టెంపుల్, సూపర్ బజార్, బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా చుంచుపల్లి విద్యానగర్‌లోని జనసేన నూతన కార్యాలయానికి చేరుకుంది. అక్కడ పార్టీ ముఖ్య నాయకులు కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి గడల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రాము, రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్, రాష్ట్ర నాయకులు ప్రేమ్, సినీ నటుడు, రాష్ట్ర నాయకుడు తనీష్, తెలంగాణ ప్రచార కార్యదర్శి సాగర్, మచ్చ సుధాకర్, సతీష్‌రెడ్డి, దుంపటి శ్రీనివాసరావు, సురేష్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, రామకృష్ణ, ఫరీద్, హసీనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ కరోనా విపత్తు సమయంలో జీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా పేదలు, నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలు, విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు తనను ఆకర్షించాయని, ప్రజాసేవే తన రాజకీయ లక్ష్యమని పేర్కొన్నారు. కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల గొప్పతనాన్ని వివరిస్తూ ఆయన చెప్పిన కవిత్వం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినీ నటుడు, జనసేన రాష్ట్ర నాయకుడు తనీష్ మాట్లాడుతూ తెలంగాణలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసే కార్యక్రమాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా గడల శ్రీనివాసరావు పోటీ చేస్తారని ప్రకటించగా, కార్యకర్తలు హర్షధ్వానాలతో స్వాగతించారు. జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రాము మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన జనసేన సిద్ధాంతాలను తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ విస్తరణ, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు చర్చించారు. అనంతరం పార్టీ విజయానికి అంకితభావంతో పనిచేస్తామని కార్యకర్తలు సంకల్పం వ్యక్తం చేశారు.

## కొత్తగూడెంలో బీజేపీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ సహాయక కేంద్రాలు ఏర్పాటు



**కొత్తగూడెం టౌన్ జూలై 12** ( ప్రజాజ్యోతి )భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు ఆదేశాల మేరకు, కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని మేదరబస్తీ, రామవరం, రామ టాకీస్ ప్రాంతాల్లో ప్రజలకు సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఎస్ఐఆర్ సహాయక కేంద్రాలు (హెల్ప్ డెస్కులు) ఏర్పాటు చేయడం జరిగింది. ఈ హెల్ప్ డెస్కుల ద్వారా ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారం, అవసరమైన మార్గదర్శకాలు మరియు సహాయ సహకారాలు అందించబడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కొత్తగూడెం పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొని హెల్ప్ డెస్కుల నిర్వహణలో తమ సహకారాన్ని అందించారు. ప్రజలకు పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు.

- బతికున్న రైతును మృతుడిగా చూపించి ఐదు ఎకరాల భూమి బదిలీ..
- అసైన్డ్ భూమిని ఇతరుల పేరుకు మార్చేందుకే పక్కా ప్రణాళిక అమలైందా..?
- ఆర్ఐ విచారణ లేకుండానే వారసత్వ ధ్రువీకరణ జారీ అయిందా..?
- నకిలీ మరణ ధ్రువీకరణ... వారసత్వ పత్రం... ధరణి మ్యుటేషన్... ఒక్కో మెట్టు ఎలా దాటారు..?
- డిజిటల్ సంతకంపై తహసీల్దార్ వివరణల్లో కొత్త సందేహాలు
- జీపీఓనే బలిపశువుగా మారుస్తున్నారా..?
- మధ్యవర్తుల పాత్రపై దర్యాప్తు జరపాలంటున్న స్థానికులు
- అసలు సూత్రధారులు ఎవరు..? సమగ్ర విచారణతోనే తేలనున్న నిజాలు
- డిజిటల్ సైన్ మిస్టరి..! పై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం




# అసైన్డ్ భూమి... పట్టా ఎలా మారింది..?

## (డిజిటల్ సైన్ మిస్టరి..!)

**బతికే ఉన్న రైతును ప్రభుత్వ రికార్డుల్లో చనిపోయిన వ్యక్తిగా చూపించి.. ఐదు ఎకరాల అసైన్డ్ భూమిని ఇతరుల పేరుకు మార్చిన దమ్మపేట వ్యవహారం రోజురోజుకూ కొత్త కోణాలను వెలుగులోకి తీసుకొస్తోంది. తొలి కథనంలో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం, వారసత్వ ధ్రువీకరణ, ధరణిలో మ్యుటేషన్, పట్టాదారు పాస్‌బుక్ జారీ వరకు జరిగిన పరిణామాలను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రజాజ్యోతి... ఇప్పుడు ఈ వ్యవహారం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? ఇంత పెద్ద ప్రక్రియ ఎందుకు చేపట్టాల్సి వచ్చింది? అనే కోణాన్ని పరిశీలించింది.**

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### »» అసైన్డ్ భూమే అసలు మలుపా..?

స్థానికంగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, సంబంధిత రైతు గతంలో ఈ అసైన్డ్ భూమిని ఇతరులకు విక్రయించినట్లు చెబుతున్నారు. మరికొందరు మాత్రం ఐదు ఎకరాలు కాదు, మూడు ఎకరాలు మాత్రమే విక్రయించారని అంటున్నారు. ఈ విషయంలో అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఇది సాధారణ ప్రైవేటు భూమి కాదు. అసైన్డ్ భూమి. అలాంటి భూమిని కొనుగోలు చేసినంత మాత్రాన యాజమాన్య హక్కులు కొనుగోలుదారుడికి రావు. చట్టం ప్రకారం అసైన్డ్ భూమి సాధారణంగా అసలు పట్టాదారు కుటుంబ వారసుల పేర్లకే బదిలీ అయ్యే అవకాశం ఉంటుంది. అదీ పట్టాదారు మరణించిన తర్వాత లేదా చట్టబద్ధమైన వారసత్వ ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలోనే ముందుగా రైతును ప్రభుత్వ రికార్డుల్లో మృతుడిగా చూపించి, ఆ తర్వాత వారసత్వ ధ్రువీకరణ తీసుకుని, దాని ఆధారంగా భూమిని ఇతరుల పేరుకు మార్చే ప్రయత్నం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే ఇప్పుడు దర్యాప్తులో కీలక అంశంగా మారింది.

### »» వారసత్వ పత్రంలో మరో మలుపు..?

ఈ వ్యవహారంలో మరో ఆసక్తికర కోణం కూడా వెలుగులోకి వస్తోంది. సమాచారం మేరకు, అసలు పట్టాదారైన రైతు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాగా, భూమిని కొనుగోలు చేసినట్లు చెబుతున్న వారు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారని తెలుస్తోంది. అసైన్డ్ భూమిని నేరుగా కొనుగోలుదారుల పేరుకు మార్చే అవకాశం లేకపోవడంతో.. వారసత్వ ధ్రువీకరణ ప్రక్రియలో సంబంధిత మహిళను అసలు రైతు కుమార్తెగా చూపించే ప్రయత్నం జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వారసత్వ ధ్రువీకరణ పత్రంలో నమోదు చేసిన కుటుంబ వివరాలు ఏ ఆధారాలపై నమోదు చేశారు? క్షేత్రస్థాయి విచారణలో వాటిని ఎలా నిర్ధారించారు? గ్రామస్థుల వాంగ్మూలాలు తీసుకున్నారా? కుటుంబ సంబంధాలను ఏ పత్రాలతో ధృవీకరించారు? అనే అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

### »» ప్రతి దశలోనూ ప్రశ్నలే...

ఈ కేసులో జరిగిన ప్రతి దశ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. అసలు గ్రామ పంచాయతీ నుంచి మరణ ధ్రువీకరణ పత్రం ఎలా జారీ అయింది?. బతికే ఉన్న వ్యక్తిని మృతుడిగా ఎవరు నమోదు చేశారు?. రెవెన్యూ కార్యాలయంలో వారసత్వ ధ్రువీకరణ ఎలా జారీ అయింది?. ఆర్ఐ నిజంగా గ్రామానికి వెళ్లి విచారణ చేశారా?. ధరణిలో మ్యుటేషన్‌కు ఎవరు ఆమోదం ఇచ్చారు?. చివరకు పట్టాదారు పాస్‌బుక్ ఏ ఆధారాలతో జారీ అయింది?. ఇప్పుడు ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం రావాల్సి ఉంది. దీంతో పాటు తహసీల్దార్ ఇస్తున్న వివరణలపైనా పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై తొలుత స్పందించిన తహసీల్దార్, ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల ఒత్తిడి కారణంగా తన ప్రమేయం లేకుండానే డిజిటల్ సంతకం జరిగిందని వివరించారు. అయితే మరో సందర్భంలో పత్రాలు సక్రమంగా ఉండటంతోనే తానే పట్టాదారు పాస్‌బుక్ జారీ చేసినట్లు చెప్పినట్లు సమాచారం. ఈ రెండు వివరణలు ఇప్పుడు కొత్త చర్చకు దారితీశాయి. అసలు డిజిటల్ సంతకం ఎలా జరిగింది? తుది పరిశీలన ఎప్పుడు జరిగింది? ఏ ఆధారాలపై తుది ఆమోదం ఇచ్చారు? అనే అంశాలపై స్పష్టత రావాలని స్థానికులు కోరుతున్నారు. అసలు బతికే ఉన్న రైతును ప్రభుత్వ రికార్డుల్లో మృతుడిగా నమోదు చేయడం... నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం... వారసత్వ ధ్రువీకరణ... ధరణిలో మ్యుటేషన్... పట్టాదారు పాస్‌బుక్... ఈ మొత్తం ప్రక్రియ ఒకదాని తర్వాత ఒకటి పూర్తవడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. గ్రామ పంచాయతీ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ఫైల్ కదలిక, డిజిటల్ రికార్డులు, సంబంధిత అధికారుల పాత్ర, సమర్పించిన పత్రాల ప్రామాణికత, మధ్యవర్తుల పాత్రపై వచ్చిన ఆరోపణలు అన్నింటినీ సమగ్రంగా విచారించినప్పుడే ఈ వ్యవహారంలో అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు, రైతు సంఘాలు అభిప్రాయపడుతున్నారు.

### »» జీపీఓతోనే కథ ముగిసిపోతుందా..?

ఈ వ్యవహారం బయటపడిన తర్వాత సంబంధిత జీపీఓ ఈ వ్యవహారంపై లిఖితపూర్వకంగా బాధ్యత స్వీకరించినట్లు సమాచారం. అయితే ఆ లేఖ ఏ పరిస్థితుల్లో రాయబడింది? స్వచ్ఛందంగానే రాశారా? లేక ఇతర పరిస్థితుల్లో రాయాల్సి వచ్చిందా? అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. అదే సమయంలో గ్రామ పంచాయతీ నుంచి రెవెన్యూ కార్యాలయం, ధరణి మ్యుటేషన్, పట్టాదారు పాస్‌బుక్ వరకు అన్ని దశలు పూర్తయిన తర్వాత మొత్తం బాధ్యత ఒక్క ఉద్యోగిపైనే ముగుస్తుందా? లేక మరికొందరి పాత్ర కూడా ఉందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ కేసులో కార్యాలయం వెలుపల పనిచేసే మధ్యవర్తుల పాత్రపైనా స్థానికంగా చర్చ జరుగుతోంది. రెవెన్యూ కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన కంప్యూటర్ సేవలకు సంబంధించిన పనులు చూసే ఒక వ్యక్తి పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అతని కుటుంబానికి ఈ కార్యాలయంతో సంబంధం ఉండటంతో అధికారులతో పరిచయాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికంగా చర్చ జరుగుతోంది. కార్యాలయానికి సంబంధించిన కొన్ని అనధికార పనులు, దరఖాస్తుల కదలిక, లాబీయింగ్ వంటి అంశాల్లో అతని జోక్యం ఉంటుందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారంలో కూడా అధికారిక వ్యవస్థకు బయట ఉన్న ఎవరైనా ఫైల్ ప్రక్రియను ప్రభావితం చేశారా? దరఖాస్తులను ముందుకు తీసుకెళ్లడంలో ఎవరైనా మధ్యవర్తులుగా వ్యవహరించారా? అనే కోణంలో కూడా సమగ్ర దర్యాప్తు జరగాలని స్థానికులు కోరుతున్నారు.